కష్టాల్లో మునగ రైతులు

- గిట్టుబాటు ధరలేక రైతులు విలవిల
- ఒక కాయ రూ.2కు కొని రూ.10కు అమ్మేస్తున్నారు
- మార్కెట్ మాయాజాలం



మునగ కాయలను మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతు



కొటికలపూడిలో సాగులో ఉన్న మునగ చేను

ఇబ్రహీంపట్నం: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో మునగ రైతులు ఉన్నారు. ఈ ఏడాది మునగ సాగు చేసిన రైతులు నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. మండలంలోని జూపూడి, కిలేశపురం, కొటికలపూడి, కేతనకొండ తదితర గ్రామాల్లో ఈ ఏడాది మునగసాగు చేపట్టిన రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. కాపు చేతికొచ్చే సమయంలో మార్కెట్ మాయాజాలంతో నష్టపోతున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

రెక్కల కష్టంతో మునగ సాగు

ఉద్యాన పంటగా గతేడాది జూలైలో సాగుచేసిన మునగ పంట ఆగస్టులో వచ్చిన కృష్ణానది వరదలకు తుడిచిపెట్టుకుపోయింది. మళ్లీ అక్టోబర్‌లో రెండో విడత మునగసాగు చేపట్టి రెక్కల కష్టాలతో మొక్కలు పెంచారు. ప్రకృతి వైపరీత్యాలు తట్టుకుని పంట చేతికొచ్చే సమయానికి ధరలు పతనమై రైతులు నష్టపోతున్నారు.

అకాల వర్షాలతో నేలవాలిన మొక్కలు

ఏడాదిలో మునగ సాగు చేపట్టే కంటే ఇతర పంటలు మినుము, మొక్కజొన్న, నువ్వులు వంటివి మూడు పంటలు సాగు చేపట్టవచ్చని రైతులు ఆశిస్తున్నారు. ఇటీవల వచ్చిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు అనేక మొక్కలు విరిగి పోయాయి. కొన్ని మొక్కలు నేలవాలాయి. దిగుబడి ఆశించిన స్థాయిలో ఉన్నప్పటికీ గిట్టుబాటు ధర లేదు. ఈ ఏడాది పెట్టుబడులు కూడా రావడం లేదంటున్నారు.

సిండికేట్‌గా వ్యాపారులు

రైతు బజార్లు, విజయవాడ రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల వ్యాపారుల మాయాజాలంలో మునగ రైతులు చిక్కుకుంటున్నారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన మునగ కాయలను హోల్‌సేల్ వ్యాపారులు తీసుకుని వారి ఇష్టం వచ్చిన రేట్లు వేస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నారు. రెండు నెలల క్రితం కిలో మునగ రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.20 చొప్పున (10నుంచి 12కాయలు) రేటు కడుతున్నారు. క్వింటా రూ.2 వేలు ధర పలుకుతోంది. ఇందులో హోల్‌సేల్ దుకాణదారుడికి 10 శాతం కమిషన్, హమాలీ, రవాణా, కోత ఖర్చులు రైతులు భరించాల్సి ఉంది. ఒక మునగ కాయ రూ.2 చొప్పున కొనుగోలు చేస్తున్న హోల్‌సేల్ వ్యాపారులు బయట మార్కెట్‌లో అదే మునగ కాయను రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి దోపిడీ చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర దక్కడం లేదు



ఎకరంలో మునగ సాగు చేపట్టాను. తొలివిడత రూ.15వేలు ఖర్చు చేయగా వరదలకు తుడిచిపెట్టుకు పోయింది. రెండోసారి సాగుకు దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందు, కలుపుతీతకు సుమారు రూ.30వేల వరకు ఖర్చు అయింది. పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు

– ఏ.సుశీల్, రైతు, జూపూడి

కిలో రూ.20కి కొంటున్నారు

ఈ ఏడాది మునగతో పాటు మినుము, మొక్కజొన్న సాగు చేపట్టాను. మినుము, మొక్కజొన్న పెట్టుబడి, రాబడికి సమానమైంది. మునగలో అయినా కొంత లాభం వస్తుందని ఆశించాను. మునగ కిలో రూ.20 (12కాయలు) చొప్పున ధర పలుకుతోంది. ఈ ఏడాది వ్యవసాయం కలిసి రాలేదు.

– ఆర్.రాఘవులు, రైతు, కొటికలపూడి

క్లుప్తంగా

11 మంది బైండోవర్



చాట్రాయి: సారా తయారు చేస్తున్న పాత నేరస్తులు 11 మందిని బైండోవర్ చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ గీత ఎదుట బైండోవర్ చేశామని ఈ బైండోవర్ సంవత్సర కాలం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని పోతనపల్లి తండాలో దాడులు చేయగా 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని మాలావతు సరోజినిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ



తిరువూరు: తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం 55 రోజులుగా స్థానిక చీరాల సెంటర్‌లో కొనసాగుతోంది. కోకిలంపాడుకు చెందిన దారా ధన్విన పుట్టిన రోజు సందర్భంగా శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జంగా లమురళీకృష్ణ, సెక్రటరీ నాళ్ల సురేంద్ర, ట్రెజరర్ పీవీ రావు, వాసవి సేవాదళ్ చైర్మన్ దోస పాటి రవికుమార్, పీఆర్‌ఓ నాళ్ల సుధాకర్, గుడిమెట్ల రాము, బొడ్డు శ్రీను, జువ్వాజి సాయికృష్ణ, గార్లపాటి లక్ష్మీకాంత్, చిట్టి, కొత్తగుండ్ల రామకృష్ణ, దోసపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ చైర్మన్‌గా వెంకటేశ్వరరావు




తిరువూరు: తిరువూరు లయన్స్‌క్లబ్ నూతన కార్యావర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా చలమాల శంకర్రావు, కోశాధికారిగా నూతక్కి రామారావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కంచర్ల ముత్య ప్రసాద్, సంకురాత్రి జనార్దన్‌రావు, కొమ్మినేని రాజేష్ ఖన్నా, గంజా కృష్ణమోహన్, అడుసుమల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, నాగబండి రాజేశ్వరరావు, సంకా రాంబాబు, చింతల వెంకటరెడ్డి, నాళ్లా సాయి ప్రసాద్, గుండా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడు కిషోర్ మృతి



నూజివీడు: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, కిషోర్ నర్సింగ్‌హోం అధినేత డాక్టర్ పాకలపాటి కిషోర్(65) శనివారం మృతిచెందారు. పట్టణంలో గత కొన్నేళ్లగా వైద్య రంగంలో విశేష సేవలు అందించారు. కొన్నాళ్లుగా ఆయన అనారోగ్య సమస్యలతో ఇంటికి పరిమితమై చికిత్స పొందుతూ చనిపోయారు. పట్టణ ప్రముఖులు, వైద్యులు, విద్యావేత్తలు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవాలు ప్రారంభం



పెనమలూరు: పోరంకి గ్రామంలోని వసంత వేణుగోపాల స్వామి, ఆంజనేయస్వామి వారి ఆలయంలో కల్యాణ మహోత్సవం శనివారం ప్రారంభమైంది. రుక్మిణి, సత్యభామ సమేత వసంత వేణుగోపాల స్వామి వారికి దివ్య తిరు కల్యాణం మహోత్సవంలో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు స్వామివార్లను పెళ్లి కుమారుడిని చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆలయంలో పార్థనా సూక్తం, విశ్వక్సేన పూజ, అంకురారోహణ, వాస్తు హోమం, ధ్వజారోహణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 11న ఉదయం 8 గంటలకు నిత్యహోమం, 9 గంటలకు శ్రీకృష్ణ మండలిచే పారాయణం, సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, రాత్రి 7.30 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత వసంత వేణుగోపాలస్వామి వారికి దివ్య తిరు కల్యాణోత్సవం జరుగుతుందని ఈఓ సుబ్బారెడ్డి తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): అదనపు కట్నం కోసం భర్త వేధింపులకు గురిచేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై నున్న పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన జొన్నలగడ్డ హిమబిందు 2019 లో గన్నవరం మండలం బుద్దవరం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ను రెండో వివాహం చేసుకొంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యం తాగి వచ్చి భార్యని అనుమానిస్తూ కొడుతున్నాడు. ఈ నెల 3వ తేదీన మద్యం తాగి వచ్చి అదనపు కట్నం తేవాలని, మానసికంగా, శారీరకంగా వేధించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించండి



మాట్లాడుతున్న శ్రీనివాస్

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తిరువూరు మండల సీపీఎం కార్యవర్గ సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలపై ఎటువంటి భారాలు మోపబోమని, విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చి ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టమన్న నారా లోకేష్, నారా చంద్రబాబునాయుడు ఇప్పుడు స్మార్ట్ మీటర్లు ఎలా కొనసాగిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే అదానితో చేసుకున్న సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. ప్రజలపై వేస్తున్న భారాలను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బలగాని వెంకటేశ్వరరావు, మోటూరి చింతయ్య, ఆకుల రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

15న ఆలయ భూములకు వేలం పాట

విస్సన్నపేట: స్థానిక చంద్రశేఖరస్వామి ఆలయానికి చెందిన వివిధ సర్వే నంబర్లలోని భూముల్లో మూడు సంవత్సరాల కాలానికి సాగు చేసుకుని ఫలసాయం అనుభవించే హక్కునకు ఈ నెల 15వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఈఓ వీవీడీ ప్రసాద్ శనివారం తెలిపారు. ఆసక్తిగల వారు చంద్రశేఖరస్వామి ఆలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎన్టీటీపీఎస్ కాలనీలో మాక్ డ్రిల్



ఇబ్రహీంపట్నంలో ఫైర్, ఎస్పీఎఫ్ సిబ్బంది మాక్‌డ్రిల్

ఇబ్రహీంపట్నం: ఇండియా–పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో ఎన్టీటీపీఎస్ కాలనీలో అత్యవసర పరిస్థితులపై శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు నేతృత్వంలో జరిగిన మాక్ డ్రిల్‌లో రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దాడులు జరిగితే చేపట్టే సహాయక చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ముందుగా కాలనీలో ఫైరింగ్ చేసి ప్రజలను అప్రమత్తం చేశారు. ఫైరింగ్ జరుగుతున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యుద్ధం జరుగుతున్న సమయంలో ఒక వేళ బైట ఉన్నట్లు అయితే సెల్లార్‌లోకి ఎలా వెళ్లాలనే దానిపై పలు సూచనలు చేశారు. కాలనీ వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించే విధానం చూపించారు. మాక్‌డ్రిల్‌లో ఎస్పీఎఫ్, ఫైర్, మెడికల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాక్ డ్రిల్‌లో భాగంగా మైలవరం ప్రభుత్వాస్పత్రిలో గాయపడిన వ్యక్తికి చికిత్స

మైలవరం: మన దేశంలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయప్రకాష్ తెలిపారు. మైలవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం వైద్య సిబ్బందితో మ్యాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విపత్కర పరిస్థితుల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ జయప్రకాష్ వివరించారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ



నూజివీడులో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు



నూజివీడులోని శ్రీకోట మహిషమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

నూజివీడు: పాకిస్తాన్‌తో చేస్తున్న మన దేశం చేస్తున్న యుద్ధానికి దేశ ప్రజలందరూ మద్దతుగా ఉన్నారని, ఆపరేషన్ సిందూర్ తప్పకుండా విజయవంతమవుతుందని సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకటరామారావు అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక అమర భవన్ నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, కార్ల స్టాండ్ మీదుగా అమర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, ఉగ్రవాదం నశించాలి, జోహార్ మురళీ నాయక్ నినాదాలతో ర్యాలీ మార్మోగింది. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు మడుపల్లి నాగేంద్రరావు, ఏఐటీయూసీ నాయకులు కే.కృష్ణ, కే.రామ్మూర్తి, టి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నూజివీడు: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు శనివారం స్థానిక కోట మహిషాసురమర్ధని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైనికులు, దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ భారత స్వాధీనం కావాలని, ప్రత్యేక పూజలు జరిపారు. బీజేపీ నాయకులు వైఎస్ దొరై, ఎం.రాజశేఖర్, మాటూరి రవికాంత్, మాటూరి ప్రసాద్, మాగంటి వాసు, అనమాల నాగేశ్వరరావు, అంబటి మల్లేశ్వరావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు దోసపాటి మల్లికార్జున జగదీష్, దద్దనాల రవికిశోర్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు షేక్ బాజీమా, మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ బాబు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్



ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న నాయకులు



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు

మైలవరం: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ డిమాండ్ చేశారు. మైలవరం మండలం బాడవ, పుల్లూరు, దాసుళ్ల పాలెం, మైలవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను తెలుసుకున్నారు. తమకు వేతనం పెంచాలని, వేసవిలో వసతులు కల్పించాలని కూలీలు కోరారు. అనంతరం నాయకులు కూలీలకు మద్దతు తెలిపి మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ కూడా కూలీలకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు వి. నాగరాజు, ఉపాధ్యక్షులు పానెం ఆనందరావు, లంక వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, జిల్లా నాయకులు రుక్మిణి జమలమ్మ పాల్గొన్నారు.

పథకాన్ని పక్కాగా అమలు చేయాలి



ముసునూరు మండలంలో కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నూజివీడు: గ్రామీణ నిరుపేద కూలీలకు ఉపాధిని కల్పించే లక్ష్యంతో చేసిన చట్టం ఉపాధిహామీ పథకాన్ని పక్కాగా అమలు చేసేలా గ్రామీణ పేదలందరూ ఏకమై ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. నూజివీడు మండలం సిద్ధార్థ నగర్, నర్సపేట, లైన్ తండా తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శనివారం స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. పనులు సరిగా చూపడం లేదని, చేసిన రోజులను కూడా తగ్గించి హాజరు చూపుతున్నారని, మస్తరులో అనేక అవకతవకలు జరుగుతున్నాయని కోటేశ్వరరావు దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గిరిజన సమాఖ్య నాయకులు బాణావతు పెద బాలూనాయక్, రాము నాయక్, సాంబయ్య, జే వెంకటేశ్వరరావు, వీరాస్వామి, సేవ్యానాయక్ పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

ముసునూరు: మండుటెండల్లో పని చేస్తున్న ఉపాధి కూలీల ఉపశమనానికి అవసరమైన సౌకర్యాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం ముసునూరుతోపాటు, సమీప గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, సౌకర్యాలను మండల కార్యదర్శి కొడవలి శ్రీను ఆధ్వర్యంలో సీపీఎం నేతలు శనివారం పరిశీలించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి, సంగీత సామ్రాట్ సంగీత సంస్థ, కేవీ బ్రహ్మానందరావు కళావేదిక ఆధ్వర్యంలో నెల వారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా భక్తి సంగీతం, సీతారామ కల్యాణం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గాయనీ గాయకులు మల్లీశ్వరి, శ్యాంప్రసాద్, స్వాతి మీరా కుమార్, అయ్యప్ప రాంమాంజీలు పలు భక్తి గీతాలను ఆలపించారు. సినీ నటి, విఖ్యాత హరికథా భాగవతారిణి పడాల కల్యాణి హరికథాగానం చేశారు. సాయిబాబు వైలెన్‌పై, మృదంగంపై పి.చైతన్య సహకరించారు. సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు మాట్లాడుతూ హరికథా సంప్రదాయాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, ఆదిరాల జయప్రభ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు హరికథా భాగవతారిణి కల్యాణిని ఆత్మీయంగా సత్కరించారు.



వీరజవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: భారత్–పాకిస్తాన్ యుద్ధంలో అమరుడైన మురళీనాయక్‌కు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. జై జవాన్ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి మాట్లాడుతూ యుద్ధంలో మురళీనాయక్ చూపించిన తెగువ, త్యాగం దేశంలోని ప్రతి పౌరుడికీ స్ఫూర్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, మైలవరం బీసీ సెల్ అధ్యక్షులు కుంచం జయరాజు, మహిళా అధ్యక్షురాలు రాణి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్ల మోతు దయాకర్, మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు, రాజేష్, ట్రేడ్ యూనియన్ నాయకులు వి సూరిబాబు, నాగరాజు, ఈశ్వరి, పుష్ప, లక్ష్మి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం టౌన్ ఫీడర్ నందు మరమ్మతులు, చెట్లు నరికే కార్యక్రమం ఉన్నందున ఆదివారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జి.రమేష్ బాబు తెలిపారు. మైలవరంలోని సిద్దిపేట, బస్టాండ్ ఏరియా, ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, పశువుల ఆస్పత్రి రోడ్డు, పోస్టాఫీస్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, శివాలయం వీధి, నూజివీడు రోడ్డు, బందగర్, రామకృష్ణ కాలనీ, ఎస్‌వీఎస్ నగర్, విజయవాడ రోడ్డు, శివాజీ వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

బాబోయ్ దోమలు



సగర బజార్‌లోని డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో దోమలు విజృంభిస్తున్నాయి. స్థానిక సగర బజార్ రోడ్‌లో డ్రెయినేజీలో పూడిక తీయక పోవడంతో ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు వల్ల దోమలు వృద్ధి చెందాయి. దీంతోపాటు ఇళ్లలోని చెత్తను కాలువల్లో వదిలేయడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. దీంతో దోమల బెడద ఎక్కువైంది. సాయంత్రం నాలుగు గంటలు దాటితే దాడి చేస్తున్నాయి.

పేరుకుపోయిన చెత్త

స్థానిక గన్నవరం రోడ్డు, హైస్కూల్ రోడ్డులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. వేద పాఠశాల రోడ్డులో కాలవల్లో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో సమీప వాసులు ఇళ్లలో ఉండలేని పరిస్థితి. వాతావరణం మార్పులతో పాటు దోమల విజృంభణతో వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇంతవరకు దోమల మందులు పిచికారీ చేసిన సందర్భాలు లేవని, కనీసం బ్లీచింగ్ చల్లడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ సర్పంచ్, సిబ్బంది స్పందించి గ్రామంలోని డ్రెయినేజీలో పేరుకుపోయిన పూడికను తొలగించి దోమల మందును పిచికారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ సమావేశంలో తమ్ముళ్ల వాగ్వాదం



టీడీపీ సమావేశంలో వాదనకు దిగిన తెలుగు తమ్ముళ్లు

విస్సన్నపేట: విస్సన్నపేట టీడీపీ టౌన్ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి నిర్వహించిన అంతర్గత సమావేశంలో తెలుగు తమ్ముళ్లు వాగ్వాదానికి దిగారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో టీడీపీ టౌన్ అధ్యక్షుడు ఎన్నిక సంబంధించి నియోజకవర్గ అబ్జర్వర్ ఎస్ శ్రీనివాసరావు సమక్షంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. కాగా టీడీపీ టౌన్ అధ్యక్ష పదవిని ఆశావాహులు పోటీపడతున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ నేపథ్యంలో చివరికి అధిష్టానం నిర్ణయం మేరకు టీడీపీ టౌన్ అధ్యక్షుడిని ఎంపిక చేయనున్నట్లు నియోజకవర్గ అబ్జర్వర్ తెలియజేసి సమావేశాన్ని ముగించారు.